IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# ప్రకృతి పరిరక్షణా పరిజ్ఞాన మార్గాలు – బాలల గేయాలు

**చిలకల బాలరాజు**
పరిశోధకుడు
తెలుగుశాఖ & అనువాద అధ్యయనశాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

1. **ఉపోద్ఘాతం :**

ఆది మానవుని గళం నుంచి మొట్ట మొదట మాట కంటే పాట వెలువడి ఉంటుందని చెప్పవచ్చు. ఆహార సముపార్జనకు వెళ్తున్నపుడో, ఆహారం దొరికినపుడో తన గుంపువారిని ఆహ్వానించుటకు వేసిన కేకలే కాల క్రమంలో పాటలు లేదా గేయాలు రూపుదాల్చి ఉంటాయని చెప్పవచ్చు. దీనికి నిదర్శనంగా పసి పిల్లల స్పందనను పేర్కొనవచ్చు. పసి పిల్లలు ఏడుస్తున్నపుడు మనం మాట్లాడిస్తే పట్టించుకోరు. అదే గేయం పాడగానే ఏడుపు మాని శ్రద్ధగా వింటారు. దీనిని బట్టి మనిషి జన్యువులలోనే గేయం పట్ల ఆకర్షణం గుణం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇలా పాటకు ఆకర్షింపబడే గుణం పిల్లలకేకాదు పెద్దలకూ ఉంది. దీనికి హేతువుగా వివిధ ప్రజా ఉద్యమాలు విజయవంతం కావడానికి పాటలు ఎంతగానో దోహదపడుతున్న సంగతి మనందరికీ తెలిసినదే. ఈ సత్యం తెలిసినందువల్లనేమో కాబోలు సంస్కృతంలోని ఆదికావ్యం 'రామాయణం' శ్లోకాల్లో రాయబడిరది. తెలుగులోని ఆదికృతి 'ఆంధ్ర భారతం' నన్నయ చేత పద్యాల్లో రాయబడిరది. ఇలా సృజించబడిన గేయాలు ముందుగా జానపదుల నోళ్ళ వెంట అలవోకగా వెలువడినట్లు చెప్పవచ్చు. ఆ తరువాత, శిష్ట కవులు వాటికి కొన్ని లక్షణాలు సమకూర్చి పద్యాలుగా మలచినట్లు భావించవచ్చు. ఇంత నేపథ్యం ఉన్నందువల్లనే నాటినుంచి నేటి వరకు గేయ సాహిత్యం కొనసాగుతూ వస్తున్నది. ముఖ్యంగా ఈ గేయాలను బాల్యంలోనే తల్లినోటి వెంట వింటాము. అలా వింటాము. మన పెద్దలు అనగా జానపదులు పిల్లల కోసం ఎన్నో గేయాలను అలవోకగా ఆలాపించారు. ఈ క్రమంలో సమయం సందర్భాన్ని ఆధారంగా చేసికొని సృజించిన గేయాలను వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు. బాలసాహిత్యంలో ఈ గేయాలది ఒక ప్రత్యేక అధ్యాయం, విజ్ఞాన భాండాగారం.

2. **ముఖ్యాంశాలు** :

ఈబాల గేయాలను ప్రకృతి, ఆహారం, పశుపక్ష్యాదులు, అందచందాలు, నిబద్ధత, పర్యావరణం, పసిపిల్లల దృక్పథం, పంటలు వంటి అంశాలుగా వర్గీకరించవచ్చు. ఈ గేయాలు తెలుగు రాష్ట్రాలంతటా విస్తరించి ఉండవచ్చు లేదా కొన్ని కొన్ని గేయాలు కొంత ప్రాంతానికే పరిమితమై ఉండవచ్చు. డా॥ ఎం. హరికిషన్ గారు కర్నూలు జిల్లాలో విస్తృత ప్రచారంలో ఉన్న గేయాలను సేకరించి గ్రంథ రూపంలోకి తెచ్చారు. ఇలా చేసి బాల సాహిత్యానికి మహోపకారం చేశారని చెప్పవచ్చు. వాటిని ఈ వ్యాసంలో పేర్కొని విశ్లేషించడం జరిగింది.

3. **వర్షం** :

ఈ భూమిపై సకల జీవులు జీవించడానికి నీరు అవసరం. ఆ నీరు వర్షం ద్వారానే లభిస్తుంది. ఆ వర్షం కురవకపోతే అన్ని వర్గాల ప్రజలు అన్ని జీవరాశులు హాహాకారాలు చేస్తాయి. రైతులు పంటలు పండిరచ లేరు. దాంతో ఆహారం కొరత ఏర్పడుతుంది. ప్రజా జీవనం అతలా కుతలమవుతుంది. అలా కాకుండా వర్షాలు సకాలంలో కురిసి రైతులు పంటలు పండిస్తే ప్రజలందరూ కడుపునిండా తిండి తింటారు. హాయిగా జీవనం సాగిస్తారు. ఈ అంశాన్ని ఒక జానపద కవి ఒక గేయంలో ఇలా అంటాడు.

**ధగధగ ధగ ధగ ఎండలు కాసెను**
**విసవిస విసవిస ఆవిరులెగెసెను**
**చక చక చకచక మేఘాలు ముసిరెను**
**మిల మిల మిల మిల మెరుపులు మెరిసెను**
**ఫెళ ఫెళ ఫెళ ఫెళ ఉరుములు ఉరిమెను**
**చిటపట చిటపట చినుకులు కురిసెను**
**జల జల జల జల దోనెలు పారెను**
**బుడ బుడ బుడ బుడ వాగులు సాగెను**
**గలగల గలగల నదులే పొంగెను**
**చెరువులు దొరువులు కళకళలాడెను**
**రైతుల ఇంటా సిరులే పొంగెను.**

**జగమున అంతా నగవులు మెరిసెను** – అంటూ వర్షం కురిసిన తీరును అద్భుతంగా చిత్రించాడు. ఇందులో ధగధగ, విసవిస, చకచక, మిలమిల, చిటపట, జలజల, బుడబుడ గలగల, కళకళ అనే పదాలు పాడుతున్నపుడు ఆ ధ్వనికి, లయకు పిల్లలు చెవులు వాలేస్తారు. దాని ద్వారా ఎంతగానో ఆనందాన్ని అనుభవిస్తారు. వర్షం స్వభావాన్ని దాని ఫలితాన్ని పిల్లలు ఈ గేయం ద్వారా బాల్యంలోనే అవగాహన చేసుకో గలుగుతారు. సులభంగా కంఠస్థం చేసి అలవోకగా పాడుకుంటారు.

4. **మామిడి ఫలం** :

ఆబాలగోపాలాన్ని తన రుచి ద్వారా ఆకర్షించే ఫలం మామిడి. ఈ మామిడిలో అనేక రకాలున్నాయి. ఒక్కో రకం కాయది ఒక్కోరుచి. ఈ ప్రకృతిలో వందలాది వృక్షాలున్నాయి. వాటి పలాలు రుచిని ఇస్తాయి. కొన్ని చెట్ల ఫలాలు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. కొన్ని ఫలాలు నల్లమల, దండకారణ్యంలో ఉంటున్నాయి. వాటి దగ్గరకు మనం వెళ్ళలేకున్నాము. ఇలా అనేక ఫలాలు వృథాగా మట్టిపాలవుతున్నాయి. అడవి మామిడి ఫలాల రుచి అద్భుతంగా ఉంటుందని ఆ అరణ్యంలో నివసించే గిరిజనులంటున్నారు. వాటిని ఆరగించే అవకాశం మైదాన ప్రాంతం వారికి

లేక పోవడం దురదృష్టమేననవచ్చు. అలాంటి మామిడి ఫలాన్ని గూర్చి ఒక జానపదకవి ఒక గేయంలో ఇలా అంటాడు.

**మామిడి మామిడి మామిడి**
**మనిషికి వరమీ మామిడి**
**ఫలాల రాజు మామిడి**
**పసందైనదీ మామిడి**
**వేసవి కానుక మామిడి**
**మనసును దోచును మామిడి**
**కాయగ వుంటే పులుపే పులుపు**
**పండుగ మారితే తీపే తీపు** ‘ అంటాడు కవి.

మామిడి పండును ఒకసారి రుచిచూస్తే మళ్ళీ అవి ఏడాదికి వచ్చేవరకు ఎదురు చూస్తుంటాము. ఈ ఫలాలను ప్రీతిగా తినని వాళ్ళు ఉండరని చెప్పవచ్చు. మన మామిడికోసం విదేశీయులు వేయి కళ్ళతో ఎదురుచూస్తుంటారు. ఈ మామిడిని ఊరగాయగా, పచ్చడిగా, జ్యూస్‌గా, ఫలంగా వినియోగిస్తున్నారు. దీని ముట్టె, బలవర్ధకమైన ఎరువుగా ఉపయోగపడుతున్నది. ఉష్ణ ప్రాంతంలోనే ఈ చెట్లు పెరుగుతాయి. ముఖ్యంగా రాయలసీమలో అడుగడుగునా మామిడి తోటలు దర్శనమిస్తాయి. ఇక్కడి రైతులకు ఇది ప్రధాన ఆదాయ వనరుగా దోహదపడుతున్నది. దీనినుంచి తీసిన జ్యూస్ ఏడాదంతా చెడకుండా ఉంటున్నది. అందువల్ల ఆబాలగోపాలం ఈ ఫలాన్ని తినడానికి అర్రులు చాస్తారనవచ్చు.

**5. ప్రకృతిని చూసి నేర్చుకోవాలనుట :**

ఒక జానపదకవి ప్రకృతిలోని వివిధ జీవుల వ్యవహారాలు వాటి ఫలితాలు తెలిపాడు. ఈ ప్రకృతిలోని వాటి ద్వారా ప్రజలు నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయంటాడు. ఒక అజ్ఞాత జానపద కవి. ముఖ్యంగా పక్షులు, చీమలు, చెట్లు, సాలీడు వంటి వాటి ద్వారా ఎంతో జ్ఞానం పొందవచ్చు. వాటిని కవి ఇలా వర్ణించాడు.

**పక్షులను చూసి తెలుసుకో**
**ఉదయించక ముందే లేవడం**
**కాకులను చూసి తెలుసుకో**
**కలిసి మెలిసి ఉండడం**
**చీమలను చూసి తెలుసుకో**
**ముందు చూపుతో బతకడం**
**తరువులను చూసి తెలుసుకో**
**పరోపకారం చేయడం**
**సాలీడును చూసి తెలుసుకో**
**గెలిచేదాకా పోరాడడం** – అంటూ చక్కని హితవు పలికాడు కవి.

పక్షులు ఉదయించకముందే నిద్రలేస్తాయి. కూతలతో మనలను లేపుతాయి. ఏదైనా ఆహారం దొరకగానే కాకులు ‘కావుకావు’మని అరుస్తాయి. తనకు దొరికింది చాలులే అనుకోవు. వాటికి ఆ స్వార్థం లేదు. తమ జాతంతా తినాలని భావించే ఏకైక జీవి ఒక కాకి మాత్రమేనని చెప్పవచ్చు. అదేమనిషికి ఆలక్షణం ఉందో లేదో తర్కించుకోవాలి. దీనిని బట్టి చూస్తే కాకులనుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఇక చీమలు చాలా ముందు చూపుతో జీవిస్తాయి. ఆరు నెలలకు సరిపడినంత ఆహారాన్ని సేకరించి దాచుకుంటాయి. అదేవిధంగా అన్నీ కలిసికట్టుగా ఉంటాయి.

క్రమశిక్షణ పాటిస్తాయి. ఒక చోటు నుంచి మరో చోటుకి వరుస క్రమంలో పయనిస్తాయి. ఇంక చెట్లను చూసి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. అవి మనకు నీడనిస్తాయి. ఫలాలనిస్తాయి. ఆకులను ఇస్తాయి. కలపను ఇస్తాయి. వివిధ పక్షులు, క్రిమికీటకాలకు, జంతువులకు ఆశ్రయాన్నిస్తాయి. ప్రకృతి సమతుల్యతను కాపాడుతాయి. కార్బన్‌డైఆక్సైడ్‌ను పీల్చుకొని ప్రాణవాయువును ఇస్తాయి. ఇన్ని అంశాలు మనం పశుపక్ష్యాదుల ద్వారా నేర్చుకోవాల్సి ఉంది. అదేవిధంగా ముఖ్యంగా చెప్పదగింది సాలీడు. గూడు అల్లే క్రమంలో సాలీడు ఎన్నిసార్లు కిందపడినా తిరిగి పైకిలేచి పట్టుదలతో గూడు అల్లెంతవరకు ప్రయత్నిస్తూనే ఉంటుంది. మనం కూడా అనుకున్న లక్ష్యం నెరవేర్చడానికి ఎన్నిసార్లైనా ప్రయత్నించాలనే సందేశాన్ని సాలీడు ఇస్తున్నది.

ఇలా పక్షులు క్రిమి కీటకాల ద్వారా ఎన్నో జీవితాంశాలు బాలలు బాల్యంలోనే నేర్చుకుంటారు. కొన్ని సందర్భాల్లో పెద్దలూ నేర్చుకుంటారు.

### 6. కన్నతల్లి ప్రేమ :

తన బిడ్డ కన్నీరు పెడితే కన్నతల్లి చూస్తూ భరించలేదు. తల్లడిల్లిపోతుంది. ఆ బిడ్డ చిరునవ్వు నవ్వేంతవరకు మనసు మనసులో ఉండదు. దానికోసం ఊయలలో పడుకోబెట్టి ఊపుతుంది. జోల పాడుతుంది. పాలు తాపిస్తుంది. ఇలాంటి సందర్భంలో ఒక తల్లి ఎలా పాట పాడుతుందో ఒక జానపద కవి ఇలా తెలిపాడు.

**ఏడవకే ఏడవకే బంగారు పాప**
**అలక మాని రావే రతనాల పాప**
**నీకంట నీరు నే చూడలేను**
**కోరినంత నీకు అందించలేను**
**అలకమాని మాతో ఆడుకోవాలి**
**అలవిగాని కోరికలు వదులు కోవాలి**
**మామనసు నీవు తెలుసుకోవాలి**
**మంచిగ నీవు నడుచుకోవాలి**
**ఏడవకే ఏడవకే బంగారు పాప**
**అలక మాని రావే రతనాల పాప**

– అంటూ చిన్న పిల్ల (లను) ను ఓదార్చే తీరును ఈ గేయంలో కవి తెలిపాడు. పసిపిల్లలను తల్లిదండ్రులు 'బంగారు' అంటారు. అలకమానమని అభ్యర్థిస్తారు. ఆ క్రమంలో నీకంట నీరు చూడలేనని తల్లి అంటుంది. అలకమాని మాతో ఆడుకోవాలని కోరుతుంది. చివరిగా మంచిగా మెలగాలని తల్లి ఆశిస్తుంది. ఈ క్రమంలో చూసినపుడు పదకవితా పితామహుడు అన్నమయ్య 'చందమామరావే, జాబిల్లిరావే' అని బాలగేయాన్ని రాసి ఆ సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చాడు.

### 7. లక్ష్యం :

ఇలాంటి గేయాల ద్వారా పిల్లలకు ప్రకృతి పట్ల చక్కని అవగాహన కలుగుతుంది. దీని ద్వారా ప్రకృతిని పరిరక్షించాలనే దృక్పథం వారిలో బాల్యంలో అంకురిస్తుంది. సాహిత్యం పట్ల అభిరుచి కలుగుతుంది.

## 8. ముగింపు :

ఈ బాలగేయాల ద్వారా పిల్లల్లో వినికిడి శక్తి పెరుగుతుంది. కంఠస్థం చేసి గుర్తుపెట్టుకొనే తత్వం కలుగుతుంది. ధారణాశక్తి పెరుగుతుంది. వీటన్నిటి ద్వారా ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. సామాజిక స్పృహతో ఆదర్శవంతమైన జీవనాన్ని సాగిస్తారు.

* * *

**ఉపయుక్త గ్రంథాలు** :

1. జానపదగేయ సాహిత్య వ్యాసావళి – నేదునూరి గంగాధరం
2. జానపగేయాలు – సాంఘికచరిత్ర – ఆచార్య బిరుదరాజు రామరాజు
3. తెలుగు జానపదగేయ గాధలు – డా॥ నాయని కృష్ణకుమారి
4. ఆంధ్ర జానపగేయ వాజ్మయ చరిత్ర – టేకుమళ్ళ కామేశ్వరరావు